సాక్షి
మంచిర్యాల
మంగళవారం ౹ 2 ౹ జూలై ౹ 2024



ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్
కేంద్రం విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 8లో▸



వైద్యుల సేవలు వెలకట్టలేనివి
జాతీయ డాక్టర్స్‌డేను జిల్లా వ్యాప్తంగా సోమ వారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను లయన్స్ క్లబ్ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /27.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

కొత్త చట్టాలు అమలు
- నస్పూర్‌లో తొలి కేసు నమోదు
- మొదటి రోజే జిల్లాలో ఎఫ్ఐఆర్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దేశ వ్యాప్తంగా మూడు కొత్త న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. సోమవారం నుంచే ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)-1860, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872, సీఆర్ పీసీ క్రిమినల్ ప్రొసిజర్ కోడ్-1973 స్థానంలో భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియం-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023 అమల్లోకి వచ్చాయి. బ్రిటిష్ కాలం నుంచి ఇవే చట్టాలు చెల్లుబాటు కాగా, వాటిని రద్దు చేసి కొత్త చట్టాల అమలుతో దేశ వ్యాప్తంగా న్యాయ చరిత్ర కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ క్రమంలో జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదయ్యాయి. ఈ కేసులన్నీ కొత్త నిబంధనల ప్రకారమే విచారణ, శిక్షలు ఉండనున్నాయి.

తొలి కేసు నస్పూర్‌లో..
కొత్త చట్ట ప్రకారం జిల్లాలోని నస్పూర్ పట్టణ పరిధిలో సోమవారం ఉదయమే ఓ కేసు నమోదైంది. విద్యుదాఘాతంతో మరణించిన ఘటనలో కొత్త చట్టాలు అమలులోకి వచ్చాక జిల్లాలో బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక్ సురక్ష సంహిత) చట్టం కింద కేసు నమోదైంది. కొత్త చట్టంలోని సెక్షన్ 194కింద అసహజ మరణం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత చట్ట ప్రకారమైతే సీఆర్‌పీసీ(క్రిమినల్ ప్రొసిజర్ కోడ్) 174 సెక్షన్ కింద కేసు నమోదు చేయాల్సి ఉండగా, తాజాగా ఈ కొత్త సెక్షన్ల ప్రకారం కేసు ముందుకు వెళ్లనుంది. ఈ సందర్భంగా రామగుండం సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త చట్టాల పై పోలీసు అధికారులు, సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇచ్చామన్నారు. కొత్త సాంకేతికత అనుగుణంగా కొత్త నిబంధనలు ఉన్నాయని, బాధిత వ్యక్తుల హక్కుల రక్షణ, నేరాల విచారణ సమర్థవంతంగా నిర్వహించడానికి రూపొందించారని పేర్కొన్నారు. కేసుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై పోలీసులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లా పశు వైద్య, పశుసంవర్థక శాఖ అధికారిగా శంకర్

ఈ.శంకర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ అధికారిగా డాక్టర్ ఈ.శంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ సంచాలకులుగా పనిచేసిన డాక్టర్ వై.రమేష్ ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో శంకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

'తెలంగాణకు గుండెకాయ సింగరేణి'

నిరసన వ్యక్తం చేస్తున్న దివాకర్‌రావు

నస్పూర్: తెలంగాణకు సింగరేణి సంస్థ గుండెకాయ వంటిదని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన టీబీజీకేఎస్ నాయకులతో కలిసి ఎస్ఆర్‌పీ 3గనిపై నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుందని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ కే.సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి

వినతిపత్రం అందిస్తున్న వెంకటేష్, రఘునాథ్

మంచిర్యాలటౌన్: నూతనంగా ప్రవేశ పెడుతున్న హైదరాబాద్-నాగ్‌పూర్ వందే భారత్ సూపర్ ఫాస్ట్ ట్రైన్‌కు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మ సిన్హాను మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. కేరళ, ఏపీ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలని, మంచిర్యాల నుంచి తిరుపతికి కొత్త రైలును ప్రారంభించాలని కోరారు. వీటికి చైర్మన్ స్పందించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోటపలుకుల తిరుపతి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి పాల్గొన్నారు.

భూమి తడవలే..!


వర్షాలు లేక నెన్నెలలో విత్తనం మొలకెత్తని పత్తి చేను

- జూన్ నెల జిల్లా సగటున 30శాతం లోటు
- వర్షాలు లేక.. ఎండ, ఉక్కపోత
- మొలకెత్తని విత్తనాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జూన్ నెలలో వర్షాలు రైతులను నిరాశపర్చాయి. ఇక జూలైలో కురిసే వర్షాలపైనే ఆశలు ఉన్నాయి. భారీ వర్షాలు కురిసి 50 శాతం పంటలు విత్తుకోవడం పూర్తి కావాల్సి ఉంది. కానీ భూమి లోపల తడిసే అంత వర్షమే కురువలేదు. చెరువుల్లోకి కొత్త నీరు చేరలేదు. చెరువులు, కుంటలు, జలాశయాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి చుట్టపుచూపుగా పలకరించిపోయాయి. అదును దాటుతున్నా వర్షాల జాడ లేక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వేసిన పత్తి విత్తనం మట్టిలోనే కలిసిపోతుండగా.. మొలక వచ్చిన పంట వడలిపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ ఒకటి నుంచి 30వరకు 167మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 117 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. జిల్లా సగటున 30శాతం లోటు నెలకొంది. మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 15మండలాల్లో 20 నుంచి 60శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఇప్పటివరకు జూన్ 27న కురిసిన 39.5మిల్లీమీటర్ల వర్షపాతమే అధికం. జిల్లాలో నైరుతి రుతు పవనాలు ప్రవేశించి 20రోజులు గడిచినా ఆశించిన వర్షాలు కురువలేదు. ఎండ వేడిమి, ఉక్కపోతతో సాధారణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రైతులు పత్తి సాగు మినహా ఇతర పంటలు సాగు చేయలేదు. సేంద్రియ కర్బనంగా వినియోగించే జీలుగ, జనుము విత్తనాలు పొలాల్లో వేసుకున్నారు.

వర్షాల కోసం పూజలు..
గ్రామాల్లో రైతులు వర్షాల కోసం గ్రామదేవతలకు పూజలు, కప్పతల్లి ఆటలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మృగశిర కార్తె వెళ్లిపోయింది. ఆరుద్ర కార్తె వచ్చి పది రోజులు గడిచింది. ఇప్పటికే జోరు వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లుతుండాలి. చెరువుల, కుంటలు, ప్రాజెక్టుల్లో కొత్త నీరు చేరి జలమట్టం క్రమేపి పెరుగుతుండాలి. పత్తి విత్తనాలు వేసుకోవడం దాదాపు పూర్తి కావడంతో వరి నాట్లు ఊపందుకోవాలి. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా ఎండలు మండుతున్నాయి. 38 నుంచి 40డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం మబ్బులు కమ్ముకుంటున్నా భారీ వర్షం కురవడం లేదు. వానాకాలం 3.42లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా ఇప్పటివరకు 1.06లక్షల ఎకరాల్లో పత్తి పంట విత్తుకున్నారు. జూలై నెలలోనైనా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు సాగైన పంటలు

పంట	సాగు(ఎకరాల్లో)
పత్తి	1,06,063
పెసలు	12
పచ్చిరొట్ట(సేంద్రియ ఎరువు)	21,626
జిల్లాలో సాగు మొత్తం	1,27,733

జిల్లా వర్షపాతం

మండలం	కురవాల్సింది	కురిసింది	లోటు
జన్నారం	197.7	140.4	29
దండేపల్లి	162.1	107.2	34
లక్సెట్టిపేట	169.5	127.5	25
హాజీపూర్	169.3	108.2	36
కాసిపేట	163.0	179.9	10 (అధికం)
తాండూర్	147.0	96.1	35
భీమిని	175.5	73.4	58
కన్నెపల్లి	175.4	83.9	52
వేమనపల్లి	165.0	103.4	37
నెన్నెల	154.5	90.9	41
బెల్లంపల్లి	165.9	173.8	5 (అధికం)
మందమర్రి	153.9	86.8	44
మంచిర్యాల	167.1	114.3	32
నస్పూర్	165.7	150.3	9
జైపూర్	183.5	116.1	37
భీమారం	178.2	137.2	23
చెన్నూర్	163.7	109.4	33
కోటపల్లి	148.6	112.6	24
జిల్లా సగటు	167.0	117.3	30

20 రోజుల సాగు సమయం గడిచింది..
జూన్ రెండో వారం నుంచి నైరుతి రుతుపవనాలతో తొలకరి వర్షాలు కురుస్తాయి. అప్పటి నుంచే రైతులు విత్తనాలు వేయడం, వరి నారు పోసుకోవడం ప్రారంభిస్తారు. జిల్లాలో పత్తి, వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది. జూలై మొదటి వారం వరకు పత్తి విత్తుకోవడం పూర్తవుతుంది. ఈ సమయంలో వరి నాట్లు వేసుకోవడం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వరి రకం ఈ నెల మొదటి వారం వరకు నాట్లు పూర్తి కావాల్సి ఉంటుంది. జలాశయాల్లో నీరు చేరకపోవడంతో రైతులు 80శాతం మంది ఇంకా నారు పోయలేదు. ఇప్పటికే 20రోజుల వానాకాలం గడిచిపోయింది. వరి నారు పోసుకుని కొందరు, దుక్కులు దున్ని మరికొందరు రైతులు ఎదురు చూస్తున్నారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలకు తెర

- 612మంది ఎస్జీటీల బదిలీకి అవకాశం
- రేషనలైజేషన్‌తో 50శాతంలోపు రిలీవ్ కష్టమే



మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఎస్జీటీల బదిలీ సోమవారం ముగిసింది. గతేడాది సెప్టెంబర్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీ, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, బదిలీతో ప్రారంభమైంది. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)గా పదోన్నతుల నేపథ్యంలో టెట్ తెరపైకి రావడం.. హైకోర్టు తీర్పుతో ప్రక్రియ ఆగిపోయింది. ఈ ఏడాది ఎన్నికల నియమావళి కారణంగా నిలిచిన బదిలీలు, పదోన్నతులకు కోడ్ ముగియగానే జూన్ 8నుంచి 22 పూర్తి చేయాలని విద్యాశాఖ ప్రకటించింది. పదవీ విరమణకు మూడేళ్లలోపు ఉన్న వారికి తప్పనిసరి మినహాయింపు ఇచ్చింది. జూన్ 22 వరకు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా కోర్టు ఉత్తర్వులు, సాంకేతిక కారణాలతో ఆగుతూ.. సాగుతూ వచ్చింది. గత వారం రోజులుగా ఎస్జీటీలు ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. బదిలీల వెబ్ఆప్షన్ల ప్రక్రియ శనివారం రాత్రి 11గంటల నుంచి ఆదివారం రాత్రి 10గంటల వరకు కొనసాగించారు. మరో మూడు గంటల వరకు అంటే అర్ధరాత్రి 1గంట వరకు ఎడిట్ ఆప్షన్ ప్రక్రియ పూర్తికాగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారుల వెరిఫికేషన్ల అనంతరం బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటితో తెలుగు, హిందీ, పీఈటీ బదిలీల ఆర్డర్ కాపీ రావడంతో తీవ్ర జాప్యం జరిగినా రాత్రి పూర్తి కావడంతో టీచర్ల బదిలీలకు తెరపడింది.

బదిలీ అయినట్లా.. కానట్లా..?
స్థానిక గోపాల్‌వాడ ప్రభుత్వ పాఠశాలలో 42 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. టీచర్లు బదిలీపై వెళ్లే అవకాశం లభించినా రేషనలైజేషన్ నిబంధనలు అడ్డుగా మారాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుంది. బదిలీపై వచ్చిన వారు చేరే వరకు వీరిని విడుదల(రిలీవ్) చేయడానికి అవకాశం లేదు. ఒకవేళ హేతబద్ధీకరణ నిబంధనల ప్రకారం కనీస ఉపాధ్యాయుల సంఖ్య ఉన్నట్లయితే సీనియర్ ఉపాధ్యాయుడు మాత్రమే రిలీవ్ అవుతారు. జిల్లాలో 50శాతం మించి ఉపాధ్యాయులు బదిలీ అయినా పాఠశాలలకు విడుదల కావడం కష్టమే. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా నియామకాలు చేపట్టి ఉపాధ్యాయులు వస్తే తప్ప రిలీవ్ అయ్యే అవకాశం లేదు. ప్రతీ పాఠశాలలో సింగిల్ టీచర్లు ఉన్నారు. మంచిర్యాల మండలంలోనే దాదాపు 13కుపైన పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు బదిలీ అయినా.. కానట్లేనని తెలుస్తోంది.

బదిలీలు ఇలా..
జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ ముగిసింది. లోకల్‌బాడీ పాఠశాల(తెలుగు మీడియం)లో 577 మంది టీచర్లు, లోకల్ బాడీ(ఉర్దూ) 5, ప్రభుత్వ పాఠశాల(తెలుగు మీడియం)లో 16, ఉర్దూ మీ డియం ఇద్దరు టీచర్లు బదిలీ అయ్యారు. ఐదుగురు తెలుగు, ఇద్దరు హిందీ, ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీల ఉత్తర్వులు వెలువడడంలో తీవ్ర ఆలస్యమైంది. బదిలీ అయినా నిబంధనల ప్రకారం కొందరు మాత్రమే విడుదలై కొత్త పాఠశాలలో చేరనున్నారు.

బదిలీ టీచర్లను విడుదల చేయాలి
బదిలీ అయిన ఎస్జీటీలను విడుదల(రిలీవ్) చేయాలి. కొత్త పాఠశాలలకు పంపించాలి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో కొత్త నియామకాలు జరిగే వరకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలి. ఉపాధ్యాయుల, పాఠశాలల రేషనలైజేషన్ ఉండదని చెప్పిన అధికారులు.. ట్రాన్స్‌ఫర్ సమయంలో హఠాత్తుగా పాత నిబంధనలు, జీవోలు తెచ్చి ఇంటర్నల్ రేషనలైజేషన్ ప్రక్రియ షురూ చేయడం అసంబద్ధమైన చర్య.
– టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- బారులు తీరిన ప్రజలు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అక్కడికక్కడే అధికారులను తన వద్దకు పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 67 అర్జీలను ప్రజలు సమర్పించారు. ఇందులో 80శాతం భూ సమస్యలకు సంబంధించినవి కాగా మిగతావి పింఛన్, విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో సీటు, విద్యుత్, తదితర సమస్యలపై ఫిర్యాదు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

- నేతకాని కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో ప్రత్యేక భవనం నిర్మించాలని నేతకాని మహర్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.
- విద్యుత్ 200లోపు యూనిట్లు వినియోగించుకుంటున్నా జీరో బిల్లు రావడం లేదని కోటపల్లి మండలం అలుగామకు చెందిన డి.వలీహైదర్ కలెక్టర్‌కు విన్నవించాడు.
- పింఛన్ వచ్చేలా చేస్తానని తన మరిది కొడుకు శ్రీనివాస్ 11 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నాడని, రైతుబంధు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే బయటపడిందని, అతడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కన్నెపల్లి మండలం టీకులపల్లి గ్రామానికి చెందిన బాయక్క కోరింది.

వేతనాలు చెల్లించాలి

పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న జిల్లాలోని 48కుక్, అసిస్టెంట్, స్వీపర్/స్కావెంజర్, వాచ్‌మెన్లకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. రెండు నెలల జీతాలు ట్రెజరీ నుంచి వచ్చినా ఒక నెల వేతనం మాత్రమే వచ్చిందని కాంట్రాక్టర్ ఇబ్బందులు గురిచేస్తున్నాడు. అతడిని తొలగించి వేతనాలు వచ్చేలా చూడాలి.
– పోస్టుమెట్రిక్ హాస్టల్స్ కుక్, హెల్పర్స్

పోడుభూములకు పట్టాలివ్వాలి
గిరిజన నిరుపేద రైతులం 20 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 17 కుటుంబాలు పోడు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నాయి. అటవీ అధికారులు సాగు పనులు చేపట్టవద్దని బెదిరిస్తున్నారు. హక్కు పత్రాలు లేవని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సాగు చేయనివ్వడం లేదు. హక్కు పత్రాలు అందజేయాలి. – పోడురైతులు, కిష్టంపేట, తాండూర్.


ధాన్యం డబ్బులు గోల్‌మాల్

- 14 మంది డబ్బులు పక్కదారి
- రైతుల ఆందోళనతో బయటపడ్డ వైనం


ఆందోళన చేస్తున్న రైతులు

జన్నారం: రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన డబ్బులో ఓ వ్యక్తి వక్రబుద్ధితో పక్కదారి పట్టాయి. అధికారులు, రైతుల కళ్లుగప్పి ఇతర ఖాతాల్లో వేసుకుని సొంతానికి వాడుకున్న వైనం రైతుల ఆందోళనతో సోమవారం బయటపడింది. మండలంలోని బాదంపల్లి గ్రామంలో పొనకల్ వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో బాదంపల్లి, చింతలపల్లి గ్రామాలకు చెందిన 14మంది రైతులు సుమారు 600 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారు. ధాన్యం డబ్బులు రాలేదని కేంద్రం నిర్వాహకుడు గందోర్ రవిని ప్రశ్నించగా.. దాటవేస్తూ వచ్చాడు. పీఏసీఎస్ కార్యాలయానికి అడుగగా.. డబ్బులు ఎప్పుడో ఖాతాలో జమ అయినట్లు చెప్పారు. రూ.12 లక్షలు గోల్‌మాల్ అయినట్లు తెలుసుకున్న రైతులు సోమవారం పొనకల్ వ్యవసాయ సహకార సంఘం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రధాన ద్వారానికి అడ్డుగా పురుగుల మందు డబ్బాతో బైఠాయించారు. వీరికి సీపీఐ కార్యదర్శి దాసరి తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, మహేశ్ తదితరులు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో శాఖ పరమైన పనుల నిమిత్తం డీసీవో రాథోడ్ బిక్కు కార్యాలయానికి రాగా రైతులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమస్య పరిష్కరించకుండా వెళ్లేందుకు సిద్ధమైన ఆయనను రైతులు అడ్డుకున్నారు. దీంతో కార్యాలయ సీఈవో రాజన్న, కేంద్రం నిర్వాహకుడు రవి, రైతులతో కలిసి డీసీవో విచారణ చేపట్టారు. రవి తప్పిదం వల్లే డబ్బులు గోల్‌మాల్ జరిగినట్లు తేలడంతో అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 20 రోజుల్లో ఇతర రైతుల ఖాతాలో పడ్డ డబ్బులు తీసుకుని డబ్బులు రాని రైతులకు ఇస్తానని రవి కార్యాలయానికి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు. ఈ విషయమై పొనకల్ పీఏసీఎస్ సీఈవో రాజన్నను వివరణ కోరగా, రవి 20 రోజుల్లో డబ్బులు ఇస్తానని సొసైటీకి లిఖిత పూర్వకంగా రాసిచ్చాడని, ఈ విషయమై విచారణ చేస్తామని పేర్కొన్నారు.

'5న బంద్, నిరసన విజయవంతం చేయండి'
మంచిర్యాలరూరల్(హాజీపూర్): బొగ్గు గనులు వేలం వేయడాన్ని నిరసిస్తూ.. సత్తుపల్లి, కోయగూడెం, ఆర్‌కె-6, శ్రావణపల్లి గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న తలపెట్టిన సింగరేణి బంద్, నిరసన ఉద్యమాలను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. నిరసనలు, బంద్‌కు సీపీఐ, ఏఐటీయూసీలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అన్ని సంఘాలు, క్రాఫ్ట్ సంఘాలతో అన్ని వర్గాల కార్మికులను కలుపుకొని సింగరేణి పరిరక్షణే ధ్యేయంగా కార్మిక హక్కులు, చట్టాలను కాపాడేలా మడమ తిప్పని పోరాటాలతో బీజేపీ, మిత్రపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. సింగరేణిని బలహీనపర్చడమే లక్ష్యంగా బొగ్గు నిక్షేపాల వేలానికి మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు.

సీఓఈలో ప్రవేశానికి పోటాపోటీ

- అడ్మిషన్లు పూర్తయినా సీటు కోసం ప్రయత్నాలు
- అదనపు సెక్షన్లపై ఆశలు


బెల్లంపల్లి సీఓఈ ముఖద్వారం

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏకైక బాలుర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) బెల్లంపల్లి విద్యాలయంలో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది. ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి వందలాది మంది విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులతోపాటు రాయని వారూ 6, 7, 8, 9వ తరగతిల్లో ఏర్పడిన బ్యాక్‌లాగ్ సీట్ల కోసం రోజువారీగా పదుల సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు సీఓఈ కళాశాల వద్ద బారులు తీరుతున్నారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తుండగా.. ఈ విద్యాలయం విద్యార్థులు చదువులో రాణిస్తున్న తీరుకు ఆకర్షితులై తమ పిల్లలకు సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల వద్ద రెకమెండేషన్ పత్రాలు తీసుకొచ్చి ప్రవేశం కల్పించాలని ఒత్తిడి తెస్తుండడంతో ప్రాధాన్యతకు అద్దం పడుతోంది. ఐదో తరగతిలో 80, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మరో 80 సీట్లు భర్తీకి అవకాశం ఉండగా.. గత నెల రోజుల నుంచి వందలాది మంది విద్యార్థులు సీఓఈ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రవేశాల గడువు ముగిసినా ఏదో ఒక ఆశతో గురుకుల విద్యాలయానికి వచ్చేవారి సంఖ్య తగ్గడం లేదు.

ఉత్తమ ఫలితాలతో ఆకర్షణ
పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక ఫలితాల్లో సీఓఈ విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులతో పోటీ పడుతున్నారు. మెరుగైన ఫలితాలతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లోనూ విజయాలు, ఏటా పలువురు విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, మెడిసిన్ ఇతర విభాగాల్లో సీట్లు సాధిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. గత ఐదేళ్లుగా బెల్లంపల్లి సీఓఈ బాలుర గురుకుల విద్యాలయం పేరు మారుమోగుతోంది. దీంతో ప్రవేశ పరీక్షలో ప్రతీ సంవత్సరం వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పోటీ పడుతున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాత్రమే సీట్లు లభిస్తుండడంతో మెజార్టీ విద్యార్థుల ఆశలు అడియాసలు అవుతున్నాయి. అయినా పట్టు వదలకుండా సీటు సాధించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉన్నత విద్య వైపు..
కళాశాల నుంచి ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తి చేసి బయటకు వెళ్లారు. ఒక్కో విద్యాసంవత్సరంలో 80మంది చొప్పున పరీక్ష రాయగా ఇందులో సుమారు 80శాతం మంది ఉన్నత విద్యావకాశాలు పొందారు. పదో తరగతి ఫలితాల్లోనూ మెరుస్తున్నారు. ఏటా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తుండడంతో అందరి దృష్టి సహజంగానే సీఓఈ గురుకులం వైపు మళ్లుతోంది. 2018 నుంచి పదో తరగతి విద్యార్థుల బ్యాచ్ ప్రారంభమై ఇప్పటి వరకు ఏడు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. 2014లో సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రారంభమైంది.

ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువు
సీఓఈలో చదివిన విద్యార్థుల్లో 74 మంది దేశంలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటివరకు ఎంబీబీఎస్-17 మంది, ఐఐటీ-7, ఎన్ఐటీ-5, ట్రిపుల్-1, జీఎఫ్ఐటీ-5, ఏఐఎస్‌టీ-1, ఐజర-1, ఐకార్-5, ఎయిర్‌క్రాఫ్ట్-1, ఢిల్లీ యూనివర్సిటీ-4, ఫోరెన్సిక్-4, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్-1, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ-15 మంది చొప్పున అభ్యసిస్తున్నారు. జేఎన్‌టీయూలో మరో 24 మంది ఇంజినీరింగ్, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలతోపాటు ఫార్మసీ, అగ్రికల్చర్, వెటర్నరీ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పదుల సంఖ్యలో అభ్యసిస్తున్నారు.

అదనపు సెక్షన్లు పెంచాల్సిన ఆవశ్యకత
సీఓఈలో సీట్ల కోసం పెరుగుతున్న పోటీని తట్టుకోవడానికి అదనపు సెక్షన్ల పెంపు ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది. ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుత విద్యాసంవత్సరం ఆఖరు కానుంది. సీఓఈలో ఐఐటీ ఫౌండేషన్ కోర్సు వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఇకపై ఐదో తరగతిలో ప్రవేశాలు ఉండవు. 8వ తరగతి నుంచి అడ్మిషన్ కల్పిస్తారు. దీంతో సీఓఈలో ప్రవేశానికి పోటీ మరింతగా పెరిగే అవకాశాలు ఉండనున్నాయి. ఈ క్రమంలో 8వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో అదనపు సెక్షన్లు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ బాధ్యతను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీసుకుంటారనే ఆశాభావాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వారసంతలో సెల్‌ఫోన్ చోరీ

కౌటాల: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారసంతలో గురుడుపేట గ్రామానికి చెందిన మహిళ సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. గ్రామానికి చెందిన పార్వతి సంతలో మట్టి కుండలు విక్రయిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె పక్కనే ఉన్న సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధిత మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


సంతోష్(ఫైల్)

నస్పూర్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మార్తాడి గ్రామానికి చెందిన మెర్పల్లి అలియాస్ నేర్పల్లి సంతోష్ (37) ఎఫ్‌సీఐ కాలనీలోని ఓ బ్రిక్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం అతను కరెంటు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుని బంధువు సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్త చట్టం ప్రకారం తొలి కేసు నమోదు

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త చట్టంలో భాగంగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ ప్రకారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొలి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత


అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలోని రోడ్డు డ్యాం వద్ద నిర్మించిన అక్రమ కట్టడాన్ని ఎంపీడీవో రాధారాథోడ్ సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కూల్చివేయించారు. రోడ్డు ద్వారా వెళ్లే మురుగునీటితో పాటు వరద నీటిని వెళ్లకుండా రోడ్డు డ్యాం వద్ద గల డ్రెయినేజీపై కొందరు గోడ నిర్మించడంతో నీళ్లు వెళ్లడంపై స్థానికులు ఫిర్యాదు చేశారని ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు ఎస్సై రాములు, ఎంపీవో బాపురావుతో కలిసి నిర్మాణాన్ని తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్

- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ప్రతిభాన్వేషణ పరీక్ష
- విద్యార్థుల్లో పరిశోధనాభిరుచికి పదును
- కేంద్ర ప్రభుత్వ విద్యావనరులశాఖ తోడ్పాటు
- మొదలైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ


రాష్ట్రస్థాయి సైన్స్‌మేళాలో తన ఆవిష్కరణను వివరిస్తున్న విద్యార్థి (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు కేవలం బట్టీ అభ్యసనానికి ప్రాధాన్యమివ్వకుండా వారిలో పరిశోధనాభిరుచిని పెంపొందింపజేసేలా ప్రయోగ రంగాలు, ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు పరుస్తోంది. ఇందులో భాగంగానే విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్) సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 2024–25విద్యా సంవత్సరానికి గానూ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు లక్షన్నరకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పరిశోధనాభిరుచి పెంపొందించేలా..

దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న పరిశోధనల కృషిని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. ఇప్పటికే ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ ఛాలెంజ్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండగా తాజాగా జాతీయస్థాయిలో వీవీఎం పరీక్షను కూడా నిర్వహిస్తున్నారు.

ప్రక్రియ ఇలా...

పాఠశాల స్థాయిలో జిల్లాలో 6 నుంచి 11వ తరగతిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని ఎంపిక చేసి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రం అందజేస్తారు.

జోనల్, జాతీయ స్థాయిలో...

జోనల్‌స్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతీ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని జాతీయ శిబిరానికి ఎంపిక చేస్తారు. జాతీయస్థాయిలో ప్రతీ తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని హిమాలయన్స్ విజేతలుగా ప్రకటించి ప్రథమ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

ఏం చేయాలంటే..

ఆసక్తి కలిగిన విద్యార్థులు www. vvm. org. in అనే వెబ్‌సైట్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబర్ 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రకటించిన తేదీల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పాఠశాల జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. సెప్టెంబర్ 1న నమూనా పరీక్ష, అక్టోబర్ 23, 27 తేదీలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. నవంబర్ 15న ఫలితాలు విడుదల చేస్తారు. డిసెంబర్ 8, 15, 22 తేదీల్లో ఒక్కోరోజు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయి. 2025 మే 17 లేదా 18 తేదీల్లో జాతీయస్థాయి పరీక్ష ఉంటుంది. అయితే ఈ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులు చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షా విధానం ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 100 బహుళైచ్ఛిక ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు అభ్యసిస్తున్న గణితం, సైన్స్ పాఠ్యపుస్తకాల్లోని అంశాలు 50 శాతం, విజ్ఞాన శాస్త్రం రంగంలో భారతదేశం కృషిపై 20 శాతం, శాస్త్రవేత్తలు వారి జీవిత చరిత్ర అంశాలపై 20 శాతం మార్కులు ఉంటాయి. వీవీఎం వారు వెబ్‌సైట్‌లో అందించే స్టడీ మెటీరియల్ నుంచి సమాచారం సేకరించుకోవచ్చు. ఇక అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్‌పై 10 శాతం ప్రశ్నలుంటాయి. ఇవన్నీ కూడా సమకాలిన అంశాలపై కేంద్రీకృతమైన అంశాలతో కూడిన ప్రశ్నలుంటాయి.



రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ హోమ్‌పేజీ

పరిశోధనాభిరుచి పెంపొందుతుంది



పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక, విజ్ఞానశాస్త్ర అంశాలపై పట్టున్న విద్యార్థులు 'విద్యార్థి విజ్ఞాన మంథన్' ద్వారా జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుంది. పోటీలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి విజ్ఞాన శాస్త్ర అంశాలపై అభిరుచి కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో పరిశోధనాభిరుచి పెంపొందుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాచారం అందించాలి.

– డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

నూతన నియామకం


నియామకపత్రం అందిస్తున్న ప్రకాశ్

చెన్నూర్: పట్టణానికి చెందిన నాయిని సతీశ్ రాజ్‌ను తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు సతీశ్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


శేఖర్ మృతదేహం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలోని గ్రావిటీకాల్వలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లికి చెందిన నైతం శేఖర్ (27) ఆదివారం అన్నారం దుబ్బగూడెంలోని భార్య నేహ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అదేరోజు రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో శేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం నీరు లేని గ్రావిటీ కాల్వలో రాళ్ల మధ్య శేఖర్ మృతదేహం లభ్యమైంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేదా ఎవరైనా హతమార్చారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా ఈ ఘటనపై మృతుని తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కాటారం సీఐ నాగార్జునరావు, కాళేశ్వరం ఎస్సై బి.చక్రపాణి పరిశీలించి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బొగ్గు బ్లాకుల వేలం దుర్మార్గమైన చర్య

- ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: కేంద్రం ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేయడం దుర్మార్గమైన చర్య అని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం మానుకోవాలని డిమాండ్ చేశారు. వేలం నిలుపుదల చేయాలని ఈ నెల 5న కలెక్టరేట్ ముట్టడి, 8 నుంచి 13 వరకు జీఎం కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు యూనియన్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, నాయకులు అక్బర్ అలీ, దాగం మల్లేశ్, సుదర్శన్, లింగయ్య, శ్రీనివాస్, రాజేశం, బానయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 94శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో జూన్ మాసంలో 94 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. సోమవారం జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏరియాలోని కేకే–5 గనిలో 15,920 టన్నులు, కాసిపేట గనిలో 11,577, కాసిపేట–2 గనిలో 6,716, శాంతిఖనిలో 5,701 టన్నులు, ఆర్కేపీ ఓసీలో 87,276, కేకే–ఓసీలో 1,47,979 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఆర్కే ఓసీలో 125 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి శాతం పెరగడానికి యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కాసిపేట గనిలో 4, కాసిపేట–2 గనిలో 2, కేకే–5 గనిలో 2 ఎస్‌డీఎల్ యంత్రాలను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. త్వరలో ఆర్కే ఓసీలో బొగ్గు నిలువలు నిండుకోనున్నాయని, అందులో పనిచేస్తున్న ఉద్యోగులను ఇదే ఏరియాలోనే సర్దుబాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు కష్టాలు


నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణి ప్రైవేటీకరణ చేసినట్లయితే కార్మికులకు కష్టాలు తప్పవని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను నిరసిస్తూ సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణను ఐక్యంగా అడ్డుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో ఉద్యోగ భద్రత ఉండదన్నారు. తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2015లో చట్టం తెచ్చినప్పుడు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, అసిస్టెంట్ సెక్రెటరీ తిరుపతిగౌడ్, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, నాయకులు నాగేశ్వర్‌రావు, రత్నం ఐలయ్య, జాడి పోశం, కాసిపేట–2 పిట్ సెక్రెటరీ శ్రీనివాస్, బొద్దున వెంకటేష్, మినుగు లక్ష్మీనారాయణ, శ్రీహరి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంపై టీబీజీకేఎస్ నిరసన


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, నాయకులు సారంగపాణి, రాజన్న, రాజయ్య, కృష్ణ, వెంకటేష్, సతీష్, రాజ్‌కుమార్, మహేందర్, మహేష్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల ఆరోపణలపై విచారణ జరుపుతాం

మంచిర్యాలఅగ్రికల్చర్: బెల్లంపల్లి పట్టణానికి చెందిన విలేకరులు బద్రి శివప్రసాద్, బద్రి వెంకటేశ్వర్లపై మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కన్వీనర్ ప్రభాత్ చేసిన ఆరోపణలు, హెచ్చరికలపై టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ విచారణ జరుపుతుందని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, కే.రాంనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు విలేకరులు సంఘ సభ్యులని, వారిపై వచ్చిన ఆరోపణలను సీనియర్ పాత్రికేయులతో విచారణ జరిపించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆరోపణలు రుజువైతే సంఘ పరంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ నెలలో ఏరియాలోని భూగర్భ గనులలో 86 శాతం, ఉపరి తల గనులలో 84 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని వెల్లడించారు. మొత్తంగా ఏరియాలో 79 శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. సమావేశంలో అధికారులు అరవిందరావు, చిరంజీవులు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఐకే1ఏ గనిపై టీబీజీకేఎస్ నిరసన


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు బ్లాకులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి చేస్తున్న కుట్రలకు నిరసనగా సోమవారం ఇందారం ఐకే1ఏ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గని ఇన్‌చార్జి కటూరి రత్నాకర్‌రెడ్డి, నాయకులు గోపాల్, తిరుపతి, దేవేందర్‌రెడ్డి, నరేందర్, నరేశ్, నర్సయ్య, బండారి శ్రీనివాస్, రమణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకునికి డాక్టరేట్


నగేశ్

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న తాటి నగేశ్‌కు డాక్టరేట్ లభించింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన నగేశ్ 2012లో ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసి 2019లో గురుకులంలో ఉద్యోగం పొందాడు. అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తూనే యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఉపేందర్ నేతృత్వంలో ఫోటో కెటాలసిస్, గ్యాస్‌సెన్సింగ్‌పై పరిశోధనలు చేపట్టాడు. పరిశోధన పత్రాలను యూనివర్సిటీకి సమర్పించగా 2024లో డాక్టరేట్ పట్టా పొందాడు.

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగదాంబకాలనీ రోడ్డులో గత నెల 30న చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగదాంబ కాలనీకి చెందిన ముస్కె భాగ్యలక్ష్మి కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఆర్కే 8 కాలనీకి చెందిన రాజేందర్, దుర్గస్వామి ఆమె మెడలోంచి చైన్ అపహరించారు. సీసీ కెమెరాల ఆధారంగా సోమవారం దుర్గస్వామి ఇంటి వద్ద నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీఐ ఆకుల అశోక్, ఎస్సై రవికుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: హిందువులను కించపరుస్తూ మాట్లాడిన రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను పట్టణంలోని మారుతీ హనుమాన్ మందిర్ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాడి తిరుపతి, వెంకటేశ్వర్‌గౌడ్, వెంకటనర్సయ్య, తుమ్మ శ్రీపాల్, కొండపాక చారి, శివకృష్ణ, హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని కాపువాడలో షేక్ ఇంతియాజ్‌కు చెందిన గోదాంలో నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6,88,400 విలువైన వివిధ రకాల గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బ్యాగులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇంతియాజ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై మహేందర్, సిబ్బంది తిరుపతి, విజయ్, సురేశ్, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

జిల్లాలో తొలి కేసు

కొత్తగా అమలవుతున్న భారతీయ న్యాయ సంహిత చట్టం ద్వారా తొలికేసు కాగజ్‌నగర్ పట్టణంలో నమోదైంది. యు/సెక్షన్ 272,275 భారతీయ న్యాయ సంహిత–2023 అండ్ సెక్.7(1),20 (2) ఆఫ్ కోట్పా కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

లక్ష్మణచాంద: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మత్స్యకారుడు దేశబోయిన పోశెట్టి (53) ఆదివారం రాత్రి చేపలు పట్టేందుకు బ్రాహ్మణ చెరువుకు వెళ్లాడు. చేపలు పట్టేక్రమంలో అతని కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సత్తెవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 194(1) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మురుగులోనే బడి చదువులు


ఇటీవల కురుస్తున్న వర్షాలకు కోటపల్లి మండలం పార్‌పల్లి ప్రాథమిక పాఠశాల చుట్టూ బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు మరే దారి లేకపోవడంతో మురుగునీటిలో నుంచే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. – కోటపల్లి